ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
గురువారం 15 ఆగస్టు 2024

నేడు స్వాతంత్ర్య దినోత్సవం

జనగామ కల్చరల్, ఆగస్టు 14: జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. సిబ్బంది టెంట్లు వేయడంతో పాటు వేదిక ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఉదయం 8.30 గంటలకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ధర్మకంచ మినీ స్టేడియంలో కార్యక్రమాలు

అనంతరం 9.30 గంటలకు ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి ఆలేరు శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

9.35 గంటలకు గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.40 గంటలకు పోలీసుల మార్చ్‌ఫాస్ట్, 9.50 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం, 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.50 గంటలకు ప్రశంసా పత్రాల పంపిణీ, 11.20 గంటలకు స్టాళ్ల సందర్శన ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.


జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది


ధర్మకంచ మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి

జిల్లా విద్యాశాఖాధికారి రాము


విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న డీఈవో రాము

బచ్చన్నపేట, ఆగస్టు 14: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. అప్పుడే తల్లిదండ్రులకు, గ్రామానికి గౌరవం దక్కుతుందన్నారు. మండలంలోని కేశిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని, ఇందులో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. కాగా, పాఠశాల హెచ్ఎం సుధాకర్ విద్యార్థుల కోసం రూ.25వేల విలువైన సివిల్ యూనిఫాంను డీఈవో చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు సామాజిక స్పృహతో ఇలాంటి కార్యక్రమాల ద్వారా ముందుకు రావడం స్వాగతిస్తున్నామని హెచ్ఎంను అభినందించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని అన్నారు. సమావేశంలో ఏపీసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు శైలజ, సత్యనారాయణ, భిక్షపతి, రాజేశ్వరి, యాకూబ్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

రాజయ్య వద్ద పనిచేసినట్లు అనుకుంటున్నారా.. అని అసహనం

ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన కడియం


ఘన్‌పూర్‌లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 14: డివిజన్ కేంద్రంలో శానిటేషన్ పనుల నిర్లక్ష్యం పట్ల ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత ఈవోపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో డాక్టర్ రాజయ్య వద్ద నిర్లక్ష్యంగా పనులు చేసినట్లు చేద్దామనుకుంటున్నారా.. అని మండిపడ్డారు. మండలంలోని సముద్రాలలో బుధవారం పర్యటించిన అనంతరం కడియం ఘన్‌పూర్ రైల్వే అండర్‌పాస్ వద్ద మూసివేసిన గేటు ఎదురుగా రోడ్డుపై బురదనీరు ఉండడాన్ని గమనించి వాహనాన్ని నిలిపి వైన్‌షాపు, కిరాణ దుకాణాల యజమానులకు సూచనలు చేశారు. షాపుల ఎదురుగా శానిటేషన్ సమస్య ఉండవద్దని ఆగ్రహం వ్యక్తం చేసి ఏం చేస్తున్నారని ఈవోను నిలదీశారు. పనులు చేయకుండా తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోనన్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి గాను రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న సైదవారి కుంట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 627లో 3.01 ఎకరాల భూమి ఉండాలన్నారు. భూమికి వెంటనే రెవెన్యూ అధికారులు హద్దులు గుర్తించి చుట్టూ ట్రెంచ్ కటింగ్ చేయాలన్నారు. ఒకటి రెండు రోజుల్లో జీపీ ఆధ్వర్యంలో జంగిల్ కటింగ్ పూర్తి చేయించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది హద్దులు ఏర్పాటు చేసిన తరువాత అక్రమ కట్టడాలు ఉంటే నోటీసులిచ్చి కూల్చివేయించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి పోను 2ఎకరాల మేర స్థలం ఉంటుందని, ఇందులో మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా మార్కెట్ నిర్మాణానికి డిజైన్ చేయించి ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కనుంచి రోడ్డు ఏర్పాటు చేసిన తరువాత రూ.4కోట్లతో మార్కెట్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు రోడ్లపై కూరగాయలు, మటన్, చికెన్, చేపలు విక్రయించుకుంటున్నారన్నారు. వారి ఇబ్బందులు తొలగించడానికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ రవీందర్, ఈవో సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, బూర్ల శంకర్, తోట సత్యం, జీడి రమేష్, రాంచంద్రం, గట్టు ఎల్లయ్యగౌడ్, పల్లె రవీందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, ఆగస్టు 14: గ్రామీణ ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం, జర్వాలపై సీఎస్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్‌ను సందర్శించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. చికున్ గున్యా, డెంగీ జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈవో సరిత, డీఆర్‌డీవో వసంత, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములు వీరే..

జనగామ కల్చరల్, ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లాలో ఉత్తమ అధికారులను ఎంపిక చేశారు. 180 మంది అధికారులతో పాటు 36 గ్రామ పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందుకోనున్నారు.

రెవెన్యూ విభాగంలో..

ఎ.కిష్టయ్య, ఏ.కే.మన్సూరీ, వి.నరేష్‌బాబు, బి.సతీష్, పి.విక్రమ్‌కుమార్, కె.ఎల్లస్వామి, జి.సంకీర్తన, పి.అజయ్‌కుమార్, ఎస్.రాజమౌళి, జి.బాలుమహేంద్ర, కె.అబ్బసాయిలు, పి.మధు

కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో..

ఎస్.అభిషేక్, వి.మనోజ్, ఎస్.నాగరాజు, జావేద్, టి.బాలు, కె.నర్సింహులు, కె.మధు

అదనపు కలెక్టర్ పేషీలో..

ఇమ్మడి రాజు, ఎండి.ఉస్మాన్, సీహెచ్.చిల్వూర్, ఎ.హరీష్

జనగామ డివిజన్‌లో..

ఎస్.లచ్చునాయక్, ఎస్.రాజనర్సయ్య, ఎం.రాకేష్, కె.యాకస్వామి, జి.రాఘవులు, ఎం.నాగరాజు

మండల స్థాయిలో..

ఎం.వెంకన్న, పి.యుగేందర్, ఎం.వంశీకృష్ణ, ఎస్.అన్వేష్, ఎం.వెంకటేశ్వర్లు, కె.ప్రవీణ్‌కుమార్, జి.భగత్‌కుమార్, పి.ఆంద్రయ్య, కె.మనోజ్, ఆర్.యాకయ్య, డి.ఐలమల్లయ్య, సీహెచ్.శంకర్, కె.యాదయ్య, రాజశ్రీ, జి.రవీందర్, ఆర్.శ్రీధర్

స్టేషన్‌ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో..

డి.వెంకటేశ్వర్లు, టి.క్రాంతికుమార్, బి.హరిప్రసాద్, వి.శ్రీకాంత్, ఎ.శ్రీనివాస్, ఎండి.తాజుద్దీన్, ఎల్లయ్య, సాంబశివ, సారయ్య

జ్యుడీషియరీ విభాగంలో..

ఎండి.రహీముద్దీన్, బి.ప్రతిభ

పోలీసు విభాగంలో..

ఆర్.భీమాశర్మ, ఎ.నర్సయ్య, జి.మహేందర్‌రెడ్డి, కె.శ్రీధర్, ఎం.భరత్, ఎం.రాజేందర్, కె.రమేష్, టి.సదానందం, బి.శ్రీనాథ్, ఎ.కనకరాజు, కె.రమేశ్, ఎం.యుగేందర్, బి.నరేశ్, ఎం.యాదగిరి, ఓ.నరేశ్, ఎం.బాలాజీ, ఎండి.రవూఫ్ పాషా, ఎం.అంజయ్య, ఎండి.మహబూబ్ పాషా

ఇంటెలిజెన్స్ విభాగంలో..

కె.ప్రభాకర్, జి.నర్సయ్య, వి.వేణుభూపాల్, ఎ.దేవేందర్‌రెడ్డి, టి.పంకజ, ఎస్.వేణుకుమార్, డి.క్రిష్ణ, ఎ.సందీప్, యు.కిరణ్

డీఆర్‌డీఏ విభాగంలో..

సెర్ప్ వింగ్‌లో డి.వినత, ఎజాజ్ పాషా, ఆవుల ఇందిర, డాకూరి సోమ్‌రెడ్డి, మునిగాల సుధాకర్, పన్నీరు అలివేలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కె.శ్రీనివాస్, ఎం.రాజకరుణ, ఎ.లింగయ్య, ఇ.మాధవరెడ్డి, ఎం.గీత, టి.రమేశ్, సెర్ప్ ఆర్గనైజేషన్స్‌లో జీవనజ్యోతి మండల సమాఖ్య, తరిగొప్పుల శాంతి (వీవో), ఏడుకొండల వెంకన్నస్వామి, నీలం సరళ, పోచన్నపేట పీపీసీ, ఎలిశాల రజిత, గుబ్బాల మన్య, కాతి శ్రీనివాస్, చిన్నం శివశంకర్

జిల్లా పంచాయతీ విభాగంలో..

బి.అరవింద్ చౌదరి, ఇ.పురుషోత్తంబాబు,

మిగతా 8వ పేజీలో...

వసతి గృహాల్లో

అధికారుల తనిఖీలు

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం

8లో

జిల్లా కేంద్రంలో తనిఖీలు

జనగామ రూరల్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో ఏసీపీ పార్థసారధి ఆధ్వర్యంలో జనగామ రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్ కార్యాలయం, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంతంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై శ్వేత, ఏఎస్సై కామేశ్వరీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


జనగామ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

78వ స్వాత్రంత్య దినోత్సవ శుభాకాంక్షలు...

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్
నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 14: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు మాడిశెట్టి ప్రసాద్‌ను టాస్క్‌ఫోర్స్, కేయూ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో నివాసం ఉంటున్న ప్రసాద్ మహారాష్ట్రకు చెందిన సునిల్‌తో కలిసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతడి బ్యాంక్‌లో ఉన్న రూ.32లక్షల డిపాజిట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, బెట్టింగ్ పెట్టడం వలన ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించవచ్చని అమాయకులను మోసం చేస్తూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండేవాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, కేయూ పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

సబ్‌స్టేషన్‌లల్లో మానవరహిత సేవలు ప్రారంభం : సీఎండీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 14: ఎన్పీడీసీఎల్ పరిధిలోని నక్కలగుట్ట, ఏజే మిల్స్ సబ్‌స్టేషన్‌లల్లో సాంకేతికతను ఉపయోగించుకొని మానవరహిత సేవలను ప్రారంభించినట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన ప్రతీ సమాచారం కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న స్కాడా సెంటర్‌కు వస్తుందని, సెంటర్‌లో ఉన్న టెక్నికల్ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ట్రిప్పింగ్ జరిగిన వెంటనే అలారం మోగుతుందని, వెంటనే టీమ్ సభ్యులు అప్రమత్తమై పవర్ ఆన్ అవుతుందన్నారు. రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారం అందుతుందన్నారు. లోపాలు ఉన్నప్పటికీ సరిదిద్దుకునే సౌకర్యం ఈ టెక్నాలజీలో ఉందన్నారు. బ్రేక్‌డౌన్ అయిన వెంటనే స్కాడా సెంటర్ నుంచి సంబంధిత ఏఈకు సమాచారం వెళ్తుందని, తద్వారా ఏఈ సిబ్బందితో వెళ్లి వెంటనే పునరుద్ధరణ పనులు చేయడం ద్వారా సమయం ఆదాతోపాటు వినియోగదారులకు యుద్ధప్రతిపాదికన సేవలను అందించడానికి వీలవుతుందన్నారు. సెప్టెంబర్ 30 వరకు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 20 సబ్‌స్టేషన్‌లను మానవరహిత సబ్‌స్టేషన్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మారుతున్నకాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకొని అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకొచ్చి మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని సీఎండీ పేర్కొన్నారు.

తళుకులీననున్న 'కళా'వైభవం

● పూర్తికావొస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణపనులు ● సెప్టెంబరు 9న కాళోజీ జయంతి రోజున సీఎంచే ప్రారంభం?


ఆడిటోరియం లోపల పనులు జరుగుతున్న దృశ్యం


కళాక్షేత్రానికి రంగులు వేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన కాళోజీ కళాక్షేత్రం పదేళ్లు గడిచినా అసంపూర్తి పనులకే కళాక్షేత్రం పరిమితమైంది. ఇటీవల వరంగల్ పర్యటన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కళాక్షేత్రం పనులపై దృష్టిసారించారు. కాళోజీ జయంతిలోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలతో అధికారులు కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై వేగం పెంచారు. సెప్టెంబరు 9న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

పదేళ్లుగా మొండి గోడలకే పరిమితం

కాళోజీ స్మారకార్థం గత ప్రభుత్వం 2014 సెప్టెంబరు 9వ తేదీన హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రానికి అట్టహాసంగా శంకుస్థాపన చేసింది. కుర్చీ వేసుకుని కూర్చుని ఏడాదిలోగా పనులను పూర్తి చేస్తానని అప్పట్లో కేసీఆర్ ప్రకటించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్‌తో కళాక్షేత్రం ప్లాన్ తయారు చేశారు. తొలుత రూ.50కోట్ల అంచనాతో కాళోజీ కళాక్షేత్రానికి నిధులు మంజూరుచేశారు. నాలుగు అంతస్థులుగా (జీ ప్లస్ 4) భవనాలు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. వీటిని మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలి దశలో సూపర్‌స్ట్రక్చర్ నిర్మాణం, రెండోదశలో ఇంటీరియల్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులను, మూడో దశలో ల్యాండ్ స్కేపింగ్, పాథ్ వే, పార్కింగ్ తదితర పనులు చేపట్టాలని నిర్ణయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, రిహార్సల్ రూమ్, గ్రీన్‌రూమ్, లాబీ, అలాగే మొదటి అంతస్థులో ఆర్టియం, ప్రీ ఫంక్షన్ ఏరియా, ఆఫీసు గదులు, ఫుడ్‌కౌంటర్, స్టోర్ రూమ్స్, వాష్ రూమ్స్ ఏర్పాటు చేస్తూ డీపీఆర్ తయారు చేశారు. అలాగే రెండో అంతస్తులో గ్రంథాలయం, ఆఫీసు, స్టోర్స్, లాబీ, వాష్‌రూమ్‌లు, మూడు, నాలుగో అంతస్తుల్లో ప్రీ ఫంక్షన్ లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్‌వాక్ లాబీ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేశారు. అయితే రెండేళ్లుగా నిధుల విషయంలో ప్రభుత్వం నాన్చుతూ వచ్చింది. కరోనాతో కాళోజీ కళాక్షేత్రం పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత నిర్మాణ వ్యయం రూ.50కోట్ల నుంచి రూ.85.10కోట్లకు పెరిగింది. అయితే గత ప్రభుత్వం రూ.40.10కోట్ల నిధులు మాత్రమే విడుదల చేయటంతో కళాక్షేత్రం పనులు నత్తనడకన సాగాయి.

సీఎం ఆదేశాలతో..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో కేవలం 60శాతం పనులు కూడా పూర్తి కాలేదు. బిల్లులు కూడా బకాయిలు ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని కొత్త ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రంపై దృష్టి పెట్టారు. జూన్ 29వ తేదీన వరంగల్‌లో పర్యటించిన సీఎం కళాక్షేత్రంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిధుల కొరతపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కళాక్షేత్రం పూర్తి చేయడానికి మరో రూ.45కోట్ల నిధులు అవసరమని వారు సీఎంకు వివరించారు. పూర్తి వివరాలతో డీపీఆర్ తయారు చేసి పంపించాలని సీఎం అధికారులను ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రానికి కావాల్సిన నిధులపై కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కూడా) అధికారుల నుంచి ప్రతిపాదనలు రావటంతో మంగళవారం రాత్రి కాళోజీ కళాక్షేత్రానికి రూ.45కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటికే రూ.40.10కోట్లు ఖర్చు చేయగా, తాజాగా ప్రభుత్వం రూ.45కోట్లు మంజూరు చేయటంతో మొత్తం రూ.85.10కోట్లతో కాళోజీ కళాక్షేత్రం వరంగల్ నగరంలో ఏర్పడనుంది. నిధులు కూడా రావటంతో కాళోజీ కళాక్షేత్రం పనులు వేగంగా జరుగుతున్నాయి.

జయంతి లోగా..

ఈ నెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రత్యేకంగా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై దృష్టి పెట్టారు. ఈ నెల 20వ తేదీ వరకు పనులు పూర్తిచేసి, ఈ నెలఖారులోగా కళాక్షేత్రంలో కవులు, కళాకారులతో ట్రయల్ నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. సెప్టెంబరు 9వ తేదీన కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తానికి ధిక్కార స్వరం కాళోజీ పేరుమీద నిర్మిస్తున్న కళాక్షేత్రంతో ఓరుగల్లుకు కళావైభవం రానుందని కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

కళా కార్యక్రమాలకే..



హైదరాబాద్ రవీంద్రభారతి తరహాలోనే రూపుదిద్దుకుంటున్న కాళోజీ కళాక్షేత్రం కళా, సాహిత్య, ఆర్ట్ గ్యాలరీలకు ఉపయోగం కానుంది. కవి సమ్మేళనం, కళలు, సాహితీ చర్చలు లాంటి వాటికి వేదిక కానుంది. అయితే ప్రయివేటు కార్యక్రమాలకు కళాక్షేత్రానికి అద్దె ఇస్తున్నారనే వార్తలను కళా, సాహితీవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. వివాహ, శుభకార్యాలయాల కు కళాక్షేత్రాన్ని అద్దెకు ఇస్తే దాని ప్రాశస్త్యం, ఉద్దేశం పక్క దారి పడుతుందని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కళా, సాహితీ కార్యక్రమాలకు తప్ప వేరే ప్రయివేటు కార్యక్రమాలకు ఇవ్వకూడదని చెబుతున్నారు.

సీఎం చేతుల మీదుగా కళాక్షేత్రం ప్రారంభం

ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా చైర్మన్, వరంగల్



కాళోజీ నారాయణరావు స్మారకార్థం నిర్మిస్తున్న కళాక్షేత్రం ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తాం. గత ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయటంలో విఫలమైంది. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం దృష్టికి కళాక్షేత్రం పరిస్థితిని తీసుకెళ్లగా, వెంటనే రూ.45కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈనెలఖారులోగా కళాక్షేత్రం పూర్తి చేసి, సెప్టెంబరు 9న ప్రారంభిస్తాం.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య


కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

బాలసముద్రం, ఆగస్టు 14: హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అవసరమైన మేరకు కూలీల సంఖ్యను పెంచి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంటర్ ఆర్జేడీ రాధాబాయికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఐఈవో గోపాల్ తదితరులు

విధుల్లో చేరిన ఇంటర్ ఆర్జేడీ జయప్రదబాయి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14: ఇంటర్మీడియెట్ వరంగల్ ఆర్జేడీగా జయప్రదబాయి బుధవారం విధుల్లో చేరారు. గతంలో హైదరాబాద్‌కు తరలించిన ఆర్జేడీ కార్యాలయాన్ని వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరిన ఆర్జేడీ జయప్రదబాయి.. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్జేడీ కార్యాలయ ఏర్పాటును పరిశీలించారు. తరలింపునకు ముందు ఆర్జేడీ కార్యాలయంలో పనిచేసిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాల్సిందిగా ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులు ఆర్జేడీ జయప్రదబాయికి శుభాకాంక్షలు తెలిపారు.

వినియోగదారుల జాతీయ సదస్సుకు సాంబరాజు చక్రపాణి

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అంబాజీలో జరిగే వినియోగదారుల జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ చీఫ్ సెక్రెటరీ నిధి ఖరే, వివిధ కేంద్ర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటున్నారు. వినియోగదారుల మండలి జాతీయ కమిటీ చైర్మన్ డాక్టర్ అనంత్ శర్మ, అధ్యక్షుడు అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండ్య ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలకు సంబంధించి రూట్ మ్యాప్‌ను విడుదల చేస్తారని చక్రపాణి తెలిపారు.







కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై విచారణ

- పదవి, అసోసియేట్ ప్రొఫెసర్ హోదాపై ఫిర్యాదులు
- ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు విచారణ బాధ్యతలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 14: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియామకం, అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతిపై రగడ రేగుతోంది. ఈ మేరకు జూలై 29, 30 తేదీల్లో హనుమకొండకు చెందిన కేఎస్ రెడ్డితో పాటు వరంగల్ దేశాయిపేట రోడ్డు ప్రాంతానికి చెందిన బి.ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి చేసిన వేర్వేరు ఫిర్యాదులు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మల్లారెడ్డి నియామకం, అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతిపై విచారణకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. ఈ పరిణామాలు వర్సిటీలో బుధవారం వెలుగులోకి రావడంతో కలకలంగా మారింది.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి

ప్రొఫెసర్ మల్లారెడ్డి వర్సిటీలోని గణిత విభాగంలో నేరుగా 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అయితే నిబంధనల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా అర్హతలు లేవని ఫిర్యాదుదారులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తగిన అర్హతలు లేకున్నా.. అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదురాలు పేర్కొన్నారు. మల్లారెడ్డి నియామకం చట్టవిరుద్ధమని, వర్సిటీ నుంచి ఆయనను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా నియమితులైన మల్లారెడ్డి వర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. యూజీసీ నిబంధనల మేరకు నేరుగా అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యేందుకు ఐదేళ్ల బోధన అనుభవంతో ఇతర అర్హతలు మల్లారెడ్డికి లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రొఫెసర్ మల్లారెడ్డికి 2002- 2006 వరకు 4 ఏళ్ల 1 నెల మాత్రమే అనుభవం ఉందని, అందులోనూ ఇండస్ట్రీ అనుభవం టీచింగ్ కిందకు రాదని ఫిర్యాదులో వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన మల్లారెడ్డిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విచారణకు ఆదేశాలు

హనుమకొండకు చెందిన కేఎస్‌రెడ్డి, వరంగల్‌కు చెందిన బి. ప్రవీణ్ కుమార్‌ల ఫిర్యాదు మేరకు రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి నివేదిక అందచేయాలని కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్, ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఆదేశించారు. అయితే తనపై వచ్చిన ఫిర్యాదు విషయాన్ని రిజిస్ట్రార్ మల్లారెడ్డి ప్రస్తావిస్తూ... తనకు అమెరికన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవంతోపాటు మరో ఒకటిన్నరేళ్లపాటు హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బోధన అనుభవం ఉందని తెలిపారు. ఇండస్ట్రియల్ అనుభవంతో పాటుపాటు బోధనానుభవం ఆధారంగా తనకు పదోన్నతి లభించిందని వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

చిలుపూర్, ఆగస్టు 14: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పల్లగుట్టలో, మండల పరిధిలో ఉన్న యూత్ కాంగ్రెస్ నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పార్టీ సంస్థాగతమైన యూత్ కాంగ్రెస్ మండల, నియోజకవర్గ, జిల్లా అధ్యక్షుల ఎన్నిక విషయంలో పార్టీ నియమావళికి కట్టుబడి పని చేయాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, నాయకులు దార రాజు, బొమ్మిశెట్టి బాలరాజు, డాక్టర్ పేరాల సుధాకర్, డాక్టర్ ఎనగందుల రత్నాకర్‌రెడ్డి, ఇసురం కృష్ణ, శ్రీను, రజనీకుమార్, సతీష్, దార అశోక్‌పాల్, రాజ్‌కుమార్, దార సతీష్, మత్రి దుర్గాప్రసాద్, మనోజ్, అనూప్, ప్రవీన్, భరత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ

దేవరుప్పుల, ఆగస్టు 14: మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆబాద్ జనగామ ఆధ్వర్యంలో విద్యార్థులకు టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాస నర్సయ్య, ఉపేందర్ సౌజన్యంతో మాతృమూర్తి సూర్యకళ జ్ఞాపకార్థం విద్యార్థులకు టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంబటి అంజయ్య, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ బాష్యం రఘు, జిల్లా చైర్మన్ అల్లాడి ప్రభాకర్, కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి సురేష్, మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాధవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూములను గుర్తిస్తాం

▸▸ రెవెన్యూ అధికారులు రామారావు, శ్రీనివాస్



శ్రీపతిపల్లిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

చిలుపూర్, ఆగస్టు 14 : మండలంలోని శ్రీపతిపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన బాధిత రైతులకు న్యాయం చేస్తామని నాయబ్ తహసీల్దార్ రామారావు అన్నారు. బుధవారం శ్రీపతిపల్లి రెవెన్యూ పరిధిలో వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రామారావు, కలువల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని 44, 45, 61, 62, 63, 66, 68, 69 తదితర సర్వే నంబర్లలో 1980 సంవత్సరంలో గ్రామానికి 40 మందికి ప్రభుత్వ భూములను అసైన్డ్ చేయడం జరిగిందన్నారు. 2018లో నలుగురి లబ్ధిదారులకు చెందిన భూమి కబ్జాకు గురయ్యాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనల మేరకు, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న ఆదేశానుసారం అన్యాక్రాంతమైన భూములను గుర్తించేందుకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు పోతుగంటి పోషయ్య, నీల లింగయ్య, నీల రాజు, కాంగ్రెస్ నాయకుడు కేశిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొయ్యడ రాందాస్, రంగు రమేష్, మోతె మహేశ్, రొడ్డ సిద్ధయ్య, మోతె ఉపేందర్, మోతె రజనీకాంత్, ఇరుగు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గెస్ట్ లెక్చరర్ల విధుల బహిష్కరణ

జనగామ కల్చరల్, ఆగస్టు 14: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లు ఈనెల 15 నుంచి విధుల బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం డీఐఈవో కల్లూరి జితేందర్‌రెడ్డికి అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం త్రీమెన్ కమిటీ ఆధారంగా గెస్ట్ లెక్చరర్లుగా తాము నియమితులమయ్యామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెన్యువల్ ఇస్తూ పీరియడ్ ప్రాతిపదికన వేతనాలు చెల్లిస్తుందన్నారు. అయితే ఈసంవత్సరం జూలై 31 వరకు మాత్రమే రెన్యువల్ ఇచ్చిందన్నారు. రెగ్యులర్ అధ్యాపకుల మాదిరిగానే తాము కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 మంది గెస్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారని, తమకు గత సంవత్సరం వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ సంవత్సరం వేతనాల సంగతే ఇంటర్ బోర్డు మరచిపోయిందన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకుండానే కొత్తగా జేఎల్ రిక్రూట్‌మెంట్లకు ఉపక్రమించడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.42వేల వేతనం, 12 నెలల పాటు చెల్లించేలా, ఉద్యోగ భద్రత కల్పించేలా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించి మోసం చేసిందన్నారు. ఇంటర్ బోర్డు గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను పునరుద్ధరించే వరకు తాము విధులకు హాజరు కాబోమన్నారు. ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థుల ప్రగతి తీరుపై అసంతృప్తి

▸▸ టీచర్లు పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే కడియం ఆగ్రహం



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 14: మండల పరిధిలోని సముద్రాల గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట విద్యార్థులకు మధ్యాహ్న భోజనంకు వినియోగించే సామగ్రి భద్రపర్చే గదిని తనిఖీ చేశారు. ఎండిపోయిన పచ్చిమిరపకాయలు, నాణ్యత లేని ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, కోడిగుడ్లను చూసి తమాషా చేస్తున్నారా.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారం ఎందుకు పెట్టడం లేదని మండిపడ్డారు. అనంతరం పాఠశాల మైదానంలో విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవంలో గాంధీజీ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయగా కడియం వారి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడుగగా సరైన సమాధానాలు రాకపోవడంతో టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు ఇలా ఉంటే మీకు బాధ అనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీచర్లు ప్రవర్తనను మార్చుకొని సరైనబోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, మాజీ సర్పంచ్ గుండె విమలనర్సయ్య, బెలిదె వెంకన్న, పోగుల సారంగపాణి, తాడూరిపరుశరాములు, జితేందర్ పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి..

మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. సముద్రాల గ్రామంలో మహంకాళి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమానికి కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడియంకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత కుందూరు సోమిరెడ్డి-నాగమణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, బెలిదెవెంకన్న, జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, పోగుల సారంగపాణి, బత్తుల బాలరాజు, మాజీ సర్పంచులు గుండె విమల-నర్సయ్య, తాటికొండ కుమారస్వామి, నేరెళ్ల రమేష్, కత్తుల కట్టయ్య, మాజీ ఎంపీటీసీలు ఇనుగాల లలితాదేవి, పడిశాల సుగుణ-వెంకటేష్, నాయకులు గొడుగు రాజు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, ఇమ్మడి హరిప్రసాద్, వీరగోని రాజు, తాడూరి పరుశరాములు, నారాయణగౌడ్, మోదంపల్లి కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

తరిగొప్పుల, ఆగస్టు 14: మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన ఓ మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ట్రేస్‌చేసి బుధవారం అప్పగించారు. ఎస్సై శ్వేత తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన జీడికంటి లలిత 5నెలల క్రితం మండల కేంద్రం నుంచి అంకుషాపూర్ వెళ్తుండగా సెల్‌ఫోన్ జారిపోయిందన్నారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి స్వాధీనం చేసుకుని బాధిత మహిళకు అందజేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చిలుపూర్, ఆగస్టు 14: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం... మండలంలోని నష్కల్‌కు చెందిన పుల్యాల సురేశ్‌రెడ్డి(35)కి తొమ్మిదేళ్ల క్రితం చిన్నపెండ్యాలకు చెందిన సుస్మితతో వివాహమైంది. సంతానం కలుగకపోవడంతో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో 20 రోజుల క్రితం వ్యవసాయ బావి వద్ద సురేశ్‌రెడ్డి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం మధ్యాహ్నం అతను మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న పోలీసులు

బచ్చన్నపేట, ఆగస్టు 14: మండలంలోని పోచన్నపేట శివారు అప్పనకుంట వద్ద నుంచి బుధవారం అక్రమంగా మట్టి తరలించేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఎస్ఐ సతీష్ తెలిపిన ప్రకారం... బచ్చన్నపేటకు చెందిన జేసీబీ డ్రైవర్ సులేమాన్ అన్సారీ, ట్రాక్టర్ డ్రైవర్లు గుజ్జుక నవీన్, గజ్జల శేఖర్‌లు కుంట నుంచి మట్టి తరలించేందుకు యత్నిస్తున్నారన్నారు. వారిని అదుపులోకి తీసుకోవటంతో పాటు వాహనాలతో సహా రెవెన్యూ అధికారుల ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేశామన్నారు. ఇక ముందు ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు.

గీతకార్మికుడి మృతి

కొడకండ్ల, ఆగస్టు 14: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కూనూరు అయిలయ్య(47) బుధవారం తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... అయిలయ్య సాయంత్రం 6.30 గంటలకు కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కగా పట్టుజారి కిందపడటంతో తలకు బలంగా దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ రమేశ్ తెలిపారు.

వ్యవసాయ బావుల వద్ద చోరీలు

బచ్చన్నపేట, ఆగస్టు 14: మండలంలో వ్యవసాయ బావుల వద్ద చోరీ ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల కొడవటూరు గ్రామంలో దొంగలు బోరు మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించుకు వెళ్లారు. మంగళవారం రాత్రి బండనాగారం గ్రామానికి చెందిన కోళ్ల నర్సిరెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఈ చోరీ ఘటనలపై బాధితులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నర్మెట, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి డి.సంతోషి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాకు రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో సంతోషి మాట్లాడుతూ రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువుల బస్తాలు అందించాలన్నారు. నాణ్యమైన పురుగు మందులు ఇచ్చి బిల్ రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశాయితండాలో వ్యక్తి అదృశ్యం

చిలుపూర్, ఆగస్టు 14: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని దేశాయితండాలో జరిగింది. బుధవారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం... దేశాయితండాకు చెందిన భూక్య జబ్బు(55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన అతను గొడవలకు దిగుతున్నాడు. ఈ క్రమంలో భార్య కాంతి మంద లించడంతో జబ్బు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్ళిపో యాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో ఆరా తీసినప్పటికీ సమాచారం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

పాలకుర్తి, ఆగస్టు 14: మండలంలోని ఈరవెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి యాకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు వర్షం, ఎండ నుంచి తట్టుకునేందుకు గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

నర్మెట, ఆగస్టు 14: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నగేష్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నగదును దోచుకుంటున్నారని, రోజు రోజుకు సైబర్ నేరాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ బంధువులు, స్నేహితులు అప్రమత్తంగా ఉండేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 14: స్థానిక శివునిపల్లి పట్టణంలో ఈనెల 15న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎమ్డీ.దస్తగిరి తెలిపారు. హనుమకొండ శరత్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జయ గార్డెన్ రోడ్డులోని దస్తగిరి ఇంటి వద్ద నేత్ర పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. హెల్త్ కార్డు కలిగి ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి అవసరమైతే శరత్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచిత రవాణా, వసతి, భోజనం కల్పిస్తారు.

పాలకుర్తిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పాలకుర్తి, ఆగస్టు 14: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా మీదుగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేస్తున్నారని అన్నారు. బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలని ఆయన కోరారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవికుమార్, పెనుగొండ సోమేశ్వర్, నిరంజన్‌రెడ్డి, ఈర్ల రాజు, పిట్ల సైదులు, రాణాప్రతాప్, మామిండ్ల వెంకన్న పాల్గొన్నారు.

వైద్యురాలిని హత్య చేసిన నిందితుడిని శిక్షించాలి

జనగామ రూరల్, ఆగస్టు 14: కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి మాట్లాడుతూ పేదల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు సేవలందిస్తుంటే దాడులు చేయడం దారుణమన్నారు. నిందితుడు సంజయ్ రాయ్‌ని బహిరంగంగా ఉరి తీయాలని, కేసును సీబీఐకి అప్పగించాలని, ప్రిన్సిపాల్, పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాకర్లు తేజస్విని, ఇరుమ్, శివాణి, వంశీ, ఈశ్వర్, రఘురాం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక జనగణమన గీతాలాపన

జనగామ కల్చరల్, ఆగస్టు 14: బీజేవైఎం ఆధ్వర్యంలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జంగా రాజవెంకట నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులు, యువత సామూహిక జనగణమన గీతాలాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలకు భరత జాతి సిద్ధమైనదన్నారు. ఈ వేడుకలను ప్రతి భారత పౌరుడు ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్, మునిసిపల్ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్తా, ఉడుగుల రమేష్, పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో అధికారుల తనిఖీలు



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విదార్థులకు సూచనలు చేస్తున్న డీపీవో స్వరూప

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 14: జిల్లాలోని పలు వసతిగృహాలను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను డీపీవో నాగపూరి స్వరూప సందర్శించారు. పాఠశాలలోని హాస్టల్ గదులను, వంట గది, వంట సామగ్రి భద్రపరుచు గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ జీపీ, శివునిపల్లి జీపీని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, ఈవోలు తిరునగిరి శ్రీకాంత్, సత్యనారాయణ, సిబ్బంది రాజు, తిరుపతి పాల్గొన్నారు.

- లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంను స్థానిక ఎంపీడీవో జలందర్ రెడ్డి తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలతో పాటు వంట గది, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ నిర్వహణ, భోజనంలో నాణ్యత, స్టాక్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీడీవో సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సీతారాం నాయుడు, పంచాయతీ కార్యదర్శి సంతోషిమాత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.
- నర్మెట: మండలంలోని మాన్‌సింగ్‌తండాలో ఉన్న కేజీబీవీ పాఠశాలను, నర్మెటలోని మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌ను తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో అరవింద్ తనిఖీ చేశారు. రిజిస్టర్లను, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతులను పరిశీలించారు. అందించే భోజనాన్ని, కూరగాయలు, సరుకులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిబాబా, కేజీబీవీ ఎస్‌వో రజిత తదితరులు పాల్గొన్నారు.
- తరిగొప్పుల: మండల కేంద్రంలోని గిరిజన బాలురు వసతి గృహంతోపాటు కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ నాగేశ్వరచారి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి సిబ్బంది మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేస్తున్నారా.. అని తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుజ్జ రవీందర్, పంచాయతీ కార్యదర్శి బండి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- దేవరుప్పుల: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్, చిన్నమడూరులోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించి మరుగుదొడ్లు, వంటశాలలో వండిన ఆహారంను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, వార్డెన్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.
- పాలకుర్తి: మండలంలోని పలు గురుకుల పాఠశాలలు, హాస్టళ్లను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు వేర్వేరుగా తనిఖీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ పాలకుర్తిలో బీసీ, ఎస్సీ హాస్టళ్లు, చెన్నూరులోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఎంపీడీవో రాములు తెలంగాణ సాంఘీక సాంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, గూడూరులోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించి తనిఖీ చేపట్టారు. మెనూ పాటించాలని సూచించారు. వారి వెంట ఆర్ఐ రాకేష్, రవీందర్ ఉన్నారు.
- కొడకండ్ల: మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర వసతి గృహాలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రమోహన్ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎస్టీ, బీసీ హాస్టల్ వార్డెన్లు అందుబాటులో లేరు. ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు, భోజనశాల శుభ్రంగా లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతీ హాస్టల్‌లో శుభ్రతను పాటించాలని సూచించారు. ఆర్ఐ శ్రీహరి, సూపరింటెండెంట్ ఇందిర పాల్గొన్నారు.
- జఫర్‌గడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల, బాలుర వసతి గృహాలను తహసీల్దార్ శంకరయ్య సందర్శించారు. బాలికలు, బాలుర హాస్టళ్లను సందర్శించి వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఆయా హాస్టళ్లలో వార్డెన్‌లు అందుబాటులో లేరు. విద్యార్థులు ఏరని హాస్టల్ సిబ్బందిని ప్రశ్నించగా స్కూల్స్‌కు వెళ్లారని సమాధానమిచ్చారని తహసీల్దార్ తెలిపారు.

జిల్లాకు పాపన్న పేరు పెట్టాలి : కేజీకేఎస్

చిలుపూర్, ఆగస్టు 14: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చిలుపూర్ మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన అమరుల యాదిలో... గీతన్నల చైతన్య యాత్ర కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన బొలగాని మల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంతకుముందు కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో కలిసి మల్కాపూర్, వెంకటాద్రిపేట, చిన్నపెండ్యాల, వెంకటేశ్వర్లపల్లి తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటమల్లయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన పాపన్న జయంతిని ఈనెల 18న ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకటి రాజన్న, గనగోని రమేష్, నారగోని రాజుగౌడ్, సట్ల లింగయ్య, నారగోని వెంకన్న, గొల్లపల్లి సారయ్య, మాచెర్ల ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి విగ్రహం బహూకరణ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 14: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని రామలింగేశ్వర ఆలయానికి బుధవారం దాతలు విఘ్నేశ్వర స్వామి వెండి విగ్రహంబహూకరించారు. సుమారు రూ.15వేలతో కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.సతీష్ తన తనయుడు ఈశ్వర ప్రసాద్ పేరు మీద విగ్రహం అందించారు.

ఉత్తములు వీరే..

(5వ పేజీ తరువాయి)

జి.మమత, బి.మహేందర్, జి.వనజ

మునిసిపల్ విభాగంలో..

ఎస్.నర్సయ్య, ఎస్.సంపత్, కొంగరి ఎల్లమ్మ, జి.కిషన్, టి.శ్రీనివాస్, వి.సత్యవాణి

మిషన్ భగీరథ విభాగంలో..

కె.సంధ్య, ఎం.నాగరాజు, పి.సుధీర్‌రెడ్డి, ఎస్.శ్రీలక్ష్మి, బి.వేణుగోపాల్, బి.రోహిత్

రోడ్లు, భవనాల శాఖ విభాగంలో..

పి.శ్రీశైలం, జి.నరేష్, డి.చైతన్య

వైద్య విభాగంలో..

జె.చంద్రమౌళి, ఎ.శ్రీనివాస్, జి.సౌఖ్య, కె.అజయ్‌కుమార్, జి.రమాదేవి, కె.రాజబాబు, ఎండి.అన్వర్ అలీ, ఎంవై.నాగరాణి, మురహరి, ఎస్.శకుంతల, వెంకటరమణ, కె.రాజేశ్, కె.నరేందర్, ఐ.శ్రీధర్, అబ్దుల్ ఫహీమ్, జె.అరవింద్

వ్యవసాయ శాఖ విభాగంలో..

సీహెచ్.వెంకటేశ్వర్లు, సీహెచ్.రాజేశ్ కుమార్, బి.అచ్యుత్

హార్టికల్చర్ విభాగంలో..

జె.రవికాంత్, జి.రామచంద్రతేజ, పి.శశికుమార్

ఎనిమల్ హస్‌బెండరీ విభాగంలో..

ఎం.అన్వేశ్, ఎం.శ్రీధర్‌బాబు, కె.గంగరాజు

హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ విభాగంలో..

బి.రజిత, కె.హేమలత

విద్యుత్ విభాగంలో..

జి.రాజ్‌కుమార్, ఎం.భిక్షపతి, ఎం.వెంకటేశ్, ఎ.నేతాజీ

విద్యా విభాగంలో..

ఎస్.శ్రావణి, పి.వరుణ్, టి.గౌతమ్‌రాజ్, గౌసియాబేగం, కె.పవన్‌బాబు

ఇంటర్ విద్యా విభాగంలో..

ఎస్.శ్రీనివాస్, ఎండి.అఫ్జల్, పి.తిరుపతయ్య

జిల్లా గ్రంథాలయ సంస్థలో..

డి.ధనలక్ష్మి

ఎక్సైజ్ విభాగంలో..

కె.పద్మ, పి.వెంకటేశ్వర్లు, ఎల్.మధుకర్‌రెడ్డి, కె.సందీప్, ఎండి.ఖలీల్

ఫైర్ విభాగంలో..

కనకం మల్లేశం, పారుపాటి సందీప్, పోతరాజు అశోక్‌కుమార్

అటవీ శాఖ విభాగంలో..

ఆర్.కొండల్‌రెడ్డి, ఎ.రమేశ్

పౌర సరఫరాల విభాగంలో..

జి.దేవా, ఇ.శ్రీనివాస్, డి.రాగరాజు

కోఆపరేటివ్ విభాగంలో..

టి.వెంకటసంతోష్‌కుమార్, ఎం.మల్లయ్య

చీఫ్ ప్లానింగ్ విభాగంలో..

ఎ.నాగరాజు, టి.స్రవంతి, ఎస్.దివాకర్

మైనారిటీ వెల్ఫేర్ విభాగంలో..

ఎస్.మాధవిలత, జహీదాబేగం, పావని

ట్రెజరీ విభాగంలో..

జి.రాజేంద్రకుమార్, కె.శ్రీనివాస్, జి.రామానంద్‌గిరి, ఆడిట్ ఆఫీస్ విభాగంలో అబ్దుల్ ఇంతియాజ్, బీసీ వెల్ఫేర్ విభాగంలో వి.లక్ష్మీనారాయణ, ఎం.అనిత, ఎండి.రహీమ్, రవాణా శాఖ విభాగంలో సతీశ్ రాంపెల్లి, ఎండి.ఖలీల్, ఎండి.సమ్మద్, జిల్లా సంక్షేమ శాఖ విభాగంలో జి.ఉమారాణి, జి.మనీశా, డి.ఫ్లోరెన్స్, సీహెచ్.రాజు, ఎల్.రవికాంత్, సీహెచ్.సుధాకర్, ఎం.రాధిక, గిరిజన సంక్షేమ శాఖ విభాగంలో జి.మల్లు, జి.జ్యోతి, బి.కిష్టా, ఎస్సీ కార్పొరేషన్ విభాగంలో బి.విక్రమ్‌కుమార్, ఇ.కొమురయ్య, కమర్షియల్ టాక్స్ విభాగంలో పి.జమున, బీ.వీ.వీ.ప్రసాద్, టి.రమాదేవి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో బి.నరేశ్, ఎస్.శ్రీనివాస్, బి.విజయ, మైన్స్ అండ్ జియాలజీ విభాగంలో కె.అనిత, ఫిషరీస్ విభాగంలో కె.స్వప్న, సీహెచ్.పూర్ణచందర్, సీహెచ్.సాంబరాజు, మెప్మా విభాగంలో ఎన్.వాణిశ్రీ, షాహీన్ సుల్తానా

మార్కెటింగ్ విభాగంలో..

బి.శ్రీనివాస్, బి.భిక్షం, ఎన్‌జీవో విభాగంలో జి.పుష్పరాణి, బి.రాజేశ్వరి, గంటా రవీందర్, బిర్రు ఇస్తారి, పి.క్రిష్ణమూర్తి, మల్లిగారి రాజు

ఎమర్జెన్సీ విభాగంలో..

ఎస్.రాంబాబు, సీహెచ్.రవికుమార్, కె.రాజు, ఎం.శ్రీనివాస్, కె.శరత్, ఎస్.వెంకటేశ్వర్లు

స్వచ్ఛదనం-పచ్చదనం విభాగంలో..

ఉత్తమ గ్రామ పంచాయతీలుగా బచ్చన్నపేట మండలంలో కొడ్వటూరు, బండనాగారం, ఆలింపూర్, చిలుపూరు మండలంలో చిన్నపెండ్యాల, కిష్టగూడెం, పల్లగుట్ట, దేవరుప్పుల మండలంలో ధర్మగడ్డతండా, లకావత్‌తండా, మన్‌పహాడ్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో స్టేషన్‌ఘన్‌పూర్, చాగల్, రాఘవాపూర్, జనగామ మండలంలో ఎర్రకుంట తండా, చీటకోడూరు, వడ్లకొండ, కొడకండ్ల మండలంలో ఎడునూతుల, రామవరం, నీలిబండతండా, లింగాలఘణపురం మండలంలో లింగాలఘణపురం, కొత్తపల్లి, సిరిపురం, నర్మెట్ట మండలంలో గండిరామవరం, మల్కపేట, మచ్చుపహాడ్, పాలకుర్తి మండలంలో వల్మిడి, రాఘవాపూర్, తొర్రూరు, రఘునాథపల్లి మండలంలో కోమల్ల, కన్నాయపల్లి, ఖిలాషాపురం, తరిగొప్పుల మండలంలో జాలుబాయితండా, వచ్చాతండా, అబ్దుల్‌నాగారం, జఫర్‌గడ్ మండలంలో తిమ్మంపేట, తమ్మడపల్లి, ఉప్పుగల్ గ్రామ పంచాయతీలు ఎన్నికయ్యాయి.